క్లుప్తంగా

మూడు అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

హనుమంతునిపాడు: పంచాయతీలోని హనుమంతాపురం, నారాయిపల్లి, రంగంపేట గ్రామాల్లోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ తానిగుండాల తిరుపతిరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. తొలుత చిన్నారులు, బాలింతలు, గర్భిణుల హాజరుశాతం పరిశీలించారు. కేంద్రాలను సక్రమంగా నిర్వహించి పంచాయతీకి మంచి పేరు తేవాలన్నారు.

పాకల బీచ్‌లో టూరిజం శాఖకు 15 ఎకరాలు

సింగరాయకొండ: మండలంలోని పాకల బీచ్‌లో 15 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు టూరిజం శాఖకు కేటాయించినట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. ప్రస్తుతం బీచ్‌లో దక్షిణం వైపు 10 ఎకరాల స్థలానికి సంబంధించి స్థల పత్రాలను మంగళవారం జిల్లా టూరిజం శాఖ అధికారి బెన్‌హర్‌కు అందజేశామని పేర్కొన్నారు. గతంలో బీచ్‌లో ఉత్తరం వైపున 5 ఎకరాల్లో హోటల్ నిర్మాణం ప్రారంభించగా, అసంపూర్తిగా నిలిచిపోయిందని ఇప్పుడు ఆ స్థలాన్ని కూడా త్వరలో టూరిజం శాఖకు కేటాయించనున్నట్లు వివరించారు. పాకల బీచ్‌లో త్వరలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

మర్రిపూడి ఎంఈఓ-2గా రవీంద్రప్రసాద్‌రెడ్డి

మర్రిపూడి: మండల రెండో విద్యాశాఖాధికారిగా డి.రవీంద్ర ప్రసాద్ రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కనిగిరి మండలం లింగారెడ్డిపల్లి ఉన్నత పాఠశాల గ్రేడ్-2 హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆయన మర్రిపూడి ఎంఈఓ-2గా నియమితులయ్యారు. ఎంఈఓ ఈవీ రంగయ్య, యూటీఎఫ్ మర్రిపూడి శాఖ సభ్యులు ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

కనిగిరి రూరల్: విద్యాభివృద్ధికి దాతలు చేయూత అభినందనీయమని హెచ్‌ఎం కె. రామశర్మ అన్నారు. ఉపాధ్యాయుడు దాత కోమటి గుంట్ల వెంకటేశ్వర్లు విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పలకలు, స్టేషనరీ తదితర సామగ్రిని మంగళవారం అందచేశారు. హెచ్‌ఎం మద్దాలి రాము, శ్రీనివాసులు, భాస్కర్ నారాయణ, మాలకొండయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించాలి

మర్రిపూడి: మండలంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలని ప్రత్యేకాధికారి ఎ ఉదయభాస్కర్ సూచించారు. కూచిపూడి సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు పొందలేకపోయిన వారిని గుర్తించి న్యాయం చేసేందుకు తహసీల్దార్, ఎంపీడీఓ నేతృత్వంలో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీమ్ సభ్యులు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సర్వేలో గుర్తించిన వారికి ఉచితంగా సచివాలయాల ద్వారా అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. ఎంపీడీఓ కె.రాజశేఖర్, ఎంఆర్ఐ ఎంవీ రమణ, ఏపీఎం బాబురావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బోద రమణారెడ్డి, సర్పంచ్ మాచేపల్లి చిన్నకోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



బహుమతి అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ దేవసహాయం

వెలిగండ్ల: జిల్లా, పాఠశాల స్థాయిలో పదోతరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛద సంస్థలు నగదు బహుమతి మంగళవారం అందచేశారు. జార్జి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ టి.దేవసహాయం మొగళ్లూరు జెడ్పీ హైస్కూల్‌లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థికి రూ.7వేలు వంతున, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.5 వేలు, తృతీయస్థానం సాధించిన విద్యార్థికి రూ.3వేలు అందజేశారు. జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ టి.సుకుమార్, ఎంఈఓలు దాసుప్రసాద్, దేవిరెడ్డి రామిరెడ్డి, హెచ్‌ఎం రాజాల కొండారెడ్డి, నాయకులు వై నాగూర్‌యాదవ్, రమణయ్య, నారాయణ పొల్లా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అదృశ్యంపై ఫిర్యాదు

పామూరు: తన కుమార్తె, మనవరాలు 3 రోజులుగా కనిపించడంలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సురేష్‌యాదవ్ తెలిపారు. మండలంలోని తిరగలదిన్నె గ్రామానికి చెందిన నల్లగట్ల మాలకొండయ్య తన కుమార్తె మొక్క విజయలక్ష్మిని ఉదయగిరి మండలవాసితో వివాహమైంది. ఈ నెల 17న విజయలక్ష్మి, ఆమె కూతురు తిరగలదిన్నెకు వచ్చారు. 18వ తేదీన ఇంటి నుంచి పనిమీద బయటకు పోతున్నామని చెప్పి వెళ్లి తిరిగి రాలేదని మాలకొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌యాదవ్ తెలిపారు.

అందరం కలిసి పనిచేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

- ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వామ్యులు
- చంద్రబాబు హయాంలో ఉద్యోగులకు ఎన్నో ఇబ్బందులు
- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆత్మీయ కలయికలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: 'ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వామ్యం. మనమంతా కలిసి పనిచేద్దాం అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి మరింత ముందుకు తీసుకెళ్దాం' అని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఎన్జీఓలతో ఆత్మీయ కలయిక సమావేశం మంగళవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు జరుగుతున్నాయన్నారు. చేసిన మంచిని, జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో ప్రతి ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. చంద్రబాబు హయాంలో ఉద్యోగులను అనేక ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేశారు. అంగన్‌వాడీ, విద్యుత్, ఇతర ఉద్యోగులపై టీడీపీ ప్రభుత్వం చేసిన పైశాచిక దాడిని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉద్యోగులను ఎంతో గౌరవంగా చూస్తున్నామన్నారు. కరోనా కష్ట కాలంలో దేశమంతా ఆర్థిక సమస్యలో కూరుక్కుని పోయిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్య తీవ్రంగా ఉన్నా .. ఎక్కడా ఉద్యోగులను ఇబ్బంది పెట్టలేదన్నారు. ఆర్థిక సమస్యతో కొంత జాప్యం మాత్రమే జరిగిందన్నారు. ఉద్యోగులకు ఎటువంటి నష్టం జరగకుండా ప్రభుత్వం జీపీఎస్‌ను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. సుమారు 10 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను సర్వీసులను రెగ్యులర్ చేసేందుకు కేబినేట్ తీర్మానం చేసినట్లు తెలిపారు. కేబినెట్ నిర్ణయాలన్నీ 60 రోజుల్లో పూర్తి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఉద్యోగికి మంచి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, జీపీఎస్‌తో దేశంలో ఆదర్శ ముఖ్యమంత్రిగా సీఎం నిలుస్తారని చెప్పారు.

సచివాలయ వ్యవస్థతో నాలుగు లక్షల ఉద్యోగాలు

సచివాలయ వ్యవస్థతో రాష్ట్రంలో సుమారు 4 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించినట్లు చెప్పారు. ప్రజలకు విస్తృత సేవలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేసేందుకు ప్రభుత్వం అనేక ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కనిగిరికి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో వివిధ శాఖల ఉన్నతాధికారులు వచ్చారని తెలిపారు. వెలిగొండ జలాలు త్వరలో పశ్చిమ ప్రకాశం, కనిగిరి ప్రాంతానికి రానున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు మేలు చేసేందుకు తాను ఎల్లప్పుడు ముందుంటానని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ సంఘాల నాయకులు పీవీ రమణారెడ్డి, తహసీల్దార్ పుల్లారావు, పార్వతి, రాం ప్రసాద్, కొండ్రెడ్డి వెంకటరెడ్డి, ఖాదర్ బాషా, రహమత్ బాషా, ఎంఈఓలు జె.ప్రసాద్‌రావు, ఉడుములు నారాయణరెడ్డి, ఏడీఏ వెంకట రమణా, వెంకటస్వామి, ఏస్తేరు రాణి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, ఇంకొల్లు వెంకటేశ్వరరెడ్డి, వెంకట్రామిరెడ్డి(చిన్నా) తదితర ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు వారి సమస్యలను, ప్రభుత్వం చేపట్టాల్సిన అంశాలను ఎమ్మెల్యే బుర్రాకు వివరించగా, సంఘాల వారీగా నివేదికలు తీసుకుని వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే బుర్రా భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, తహసీల్దార్ యు పుల్లారావు, ఏఎస్ డబ్ల్యూఓ రాజేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, సాల్మన్ రాజు, ఎస్కే జిలానీ, ఎంఈఓలు ఆర్ శ్రీనివాసులు, నారాయణ, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, ఎన్జీఓ నేతలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం అండ

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు



దివ్యాంగులకు త్రిచక్ర మోటారు వాహనాలు పంపిణీ చేస్తున్న వరికూటి

టంగుటూరు: దివ్యాంగులకు అవసరమైన వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, ట్రైసైకిళ్లు అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజవర్గంలోని ఆరు మండలాల దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి మంజూరైన 10 త్రిచక్ర మోటారు వాహనాలను మంగళవారం వరికూటి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో దివ్యాంగులకు మేలు చేసే పథకాలతోపాటు మూడు చక్రాల వాహనాలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఏ సమస్య వచ్చినా త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి జి.అర్చన, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీఓ రత్నజ్యోతి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు మండల జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, నాయకులు బీసీడి ఉదయ కుమార్, ఆనం సత్యనారాయణరెడ్డి, మన్నం వెంకయ్య, సింగరాయకొండ జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, నల్లూరి సురేంద్ర, కొమ్మలపాటి మధు, గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి, ముళ్లపూడి సత్యనారాయణ, బల్లెల అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హామీలు 99 శాతం అమలు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి

కొండపి: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం నెరవేర్చారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక పాదిలి రోడ్డులోని కళ్యాణ మండపంలో కొండపి సొసైటీ చైర్మన్ బొక్కిసం ఉపేంద్రచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గడిచిన 75 ఏళ్లలో దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో సీఎం జగనన్న సంక్షేమం, అభివృద్ధి చేసి చూపారన్నారు. సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు నేరుగా రూ.2.25 లక్షల కోట్లు అందించారన్నారు.ఒక్కో గ్రామంలో సచివాలయాలు, ఆర్బీకేలు, డిజిటల్ గ్రంథాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, బీఎంసీలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు రూ.2 కోట్ల నుంచి రూ.2.5 కోట్ల వరకు ఖర్చు చేశారని వివరించారు. కొండపి నియోజకవర్గంలో 14 వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని పేర్కొన్నారు. అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తున్నా ఎల్లో మీడియాని అడ్డుపెట్టుకుని జగనన్నపై టీడీపీ నేతలు దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజలు టీడీపీని నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డపాటి అరుణమ్మ మాట్లాడుతూ.. సీఎం జగనన్న తిరుగులేని ప్రజా నాయకుడని, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుపొందడం ఖాయమన్నారు. బీసీ విభాగం పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ బొట్ల రామారావు మాట్లాడుతూ.. బీసీలను టీడీపీ వాడుకోవటం తప్ప బీసీల అభ్యున్నతికి చేసిందేమీలేదన్నారు. జగనన్న పాలనలో బీసీలకు అన్నీ రంగాల్లో సముచిత స్థానం దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రావూరి ప్రభావతి, పొన్నలూరు ఎంపీపీ మాధవ, మర్రిపూడి కన్వీనర్ బోద రమణారెడ్డితోపాటు ఆరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు



వెలిగండ్లలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ



హెచ్.ఎంపాడులో నగదు బహుమతి అందజేస్తున్న ఎంఈఓ



పామూరులో విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ, పీఎంసీ చైర్మన్



విద్యార్థుల తల్లిదండ్రులను అభినందిస్తున్న ఎంఈఓ నాగేంద్రవదన్

వెలిగండ్ల: విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు అవార్డులు ఇస్తున్నట్లు జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని వెలిగండ్ల, ఇమ్మడిచెరువు, కస్తూరిబా, మొగళ్లూరు హైస్కూల్‌లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం జగనన్న ఆణిముత్యాలు అవార్డులు అందజేశారు. అనంతరం మొగళ్లూరులో నర్సమాంబాపురం హెచ్‌ఎం టి.దేవసహాయం ను ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ టి.సుకుమార్, ఎంఈఓలు దాసుప్రసాద్, దేవిరెడ్డి రామిరెడ్డి, వెలిగండ్ల సర్పంచ్ టి/ సురేష్‌బాబు, సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, హెచ్‌ఎం రాజాల కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక కస్తూరిబా బాలిక పాఠశాలలో జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో ఎంఈఓ జి.పెద్దిరాజు పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.ఇందిరా సుహాసిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పదో తరగతిలో 565 మార్కులు సాధించిన వేశపోగు ప్రవల్లికకు రూ.3 వేలు, పాఠశాల స్థాయిలో రెండు మూడు స్థానాలో నిల్చిన విద్యార్థులకు గుంటి మీనకు రూ.2 వేలు, మూడోవ బహుమతి సంధ్యాకు రూ.1000 వంతున నగదు, మెడల్స్ అందజేశారు.

పామూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో పోటీతత్వం పెంచి వారిని ఉన్నత విద్యావంతులు చేసేందుకే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలపేరుతో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తోందని ఎంఈఓ ఎస్.రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మంగళవారం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సంజీవి అధ్యక్షతన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను నగదు ప్రోత్సాహకాల ఇచ్చి సన్మానించారు. పీఎంసీ చైర్మన్ ఓగూరి తులసీఏడుకొండలు, మితికాల నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

జరుగుమల్లి(కొండపి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జరుగుమల్లి ఎంఈఓ బత్తుల నాగేంద్రవదన్ పేర్కొన్నారు. జరుగుమల్లి మండలంలోని కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయరాలు ఎల్.అనురాధ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఎంఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.

ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, పాఠశాల సిబ్బందిని ఎంఈఓ అభినందించారు. అనంతరం బహుమతులు అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కె.పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ నూతలపాటి వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ చాగంటి అనంతలక్ష్మి, డి.శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించండి



ఎంఈఓలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉత్తమమైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో నూతనంగా నియమితులైన ఎంఈఓ1, ఎంఈఓ-2 జె ప్రసాద్‌రావు, యు నారాయణరెడ్డి, ఆర్ శ్రీనివాసులు, నారాయణలు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కలిసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బుర్రా ఎంఈఓలను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులతో అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. నాడు-నేడు పథకంతో కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, కనిగిరి, పీసీపల్లి, హెచ్‌ఎంపాడు ఎంఈఓలు జె.ప్రసాద్‌రావు, యు నారాయణరెడ్డి, ఆర్ శ్రీనివాసులు, నారాయణ, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు కొండ్రెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చిన్నా, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్సై కృష్ణపావనికి సన్మానం



ఎస్సై కృష్ణ పావనిని సన్మానిస్తున్న చైర్మన్ గఫార్, బీసీ సంఘాల నాయకులు

కనిగిరి రూరల్: కేంద్ర హోం శాఖ హెచ్‌ఎం పాడు పోలీస్ స్టేషన్‌కు ప్రకటించిన సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రశంసాపత్రాన్ని డీజీపీ, ఎస్పీ మల్లికాగర్గ్ గార్గ్ చేతుల మీదుగా అందుకున్న ఎస్సై కృష్ణాపావని మంగళవారం రాత్రి స్థానిక హెచ్‌ఎం పాడు పోలీస్‌స్టేషన్‌లో పలువురు ప్రజా ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు కలిసి అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, బీటీఏ జిల్లా అధ్యక్షుడు దద్దాల శ్రీనివాసులు, ఈర్ల రామరాజు, ఎస్కే నాయబ్ రసూల్, ఓబులేసు, పల్లా మాలకొండయ్య, చింతలపూడి వెంకటేశ్వర్లు, బారాహిమామ్, ద్రోణాదుల చెంచులు, కే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయండి



పామూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ గఫార్



పొన్నలూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

వెలిగండ్ల: జూలై 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జగనన్న సురక్ష పథకం కార్యక్రమం అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. మండలంలోని గుడిపాటిపల్లి, ఇమ్మడిచెరువు, పి. రాళ్లపల్లి, కంకణంపాడు గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుకుమార్ మాట్లాడుతూ కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, జనన ధృవీకరణ పత్రం, మరణ ధృవీకరణ పత్రం, వివాహ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుడి ధృవీకరణ పత్రం, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, పంటసాగు హక్కు కార్డులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వలంటీర్ ప్రతి ఇంటిని సందర్శించి సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ దయాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పామూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది విజయవంతం చేయాలని తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి, ఎంపీడీఓ వి.శ్రీనివాసులు అన్నారు. స్థానిక సచివాలయంలో మంగళవారం సాయంత్రం జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులు, ప్రజాసమస్యలను యాప్‌లో నమోదుచేయడం, వాటిని పరిష్కరించే విధానాలపై అవగాహన కల్పించారు. మండలంలో జనన, మరణ, కుల, ఆదాయ, వివాహ ధృవీకరణ పత్రాలు లేనివారు జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటికీ వచ్చే సచివాలయ సిబ్బంది, వలంటీర్లద్వారా నమోదుచేసుకుని సర్టిఫికెట్లను పొందాలన్నారు. ఈఓఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి, ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్, అధికారులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను తలుపు తట్టి అందిచాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 1వ వార్డు సచివాలయ కార్యాలయంలో మంగళవారం సచివాలయ సెక్రటరీలకు, వలంటీర్లకు, కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అర్హత కల్గిన ప్రతి ఒక్కరి దరిచేరేలా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, రామనబోయిన ప్రశాంతి శ్రీను, వేల్పుల వెంకటేశ్వర్లు, నక్కా ఉమా, దేవరాజ్, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహించనున్న జగనన్న సురక్ష పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ జీవీ క్రిష్టారావు, తహసీల్దార్ ఎస్.హరిబాబు అన్నారు. స్థానిక సచివాలయంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, ఈఓఆర్డీ షేక్ షరీఫ్, సర్పంచ్‌లు కత్తిరాజారావు, కలుకూరి దేవకరుణమ్మ. భవనం క్రిష్టారెడ్డి, గాలం రామక్రిష్ణ, అంకాలమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'జగనన్న సురక్ష'

సింగరాయకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు చేరువచేసేందుకు గ్రామ వలంటీర్లు కృషి చేయాలని ఎంపీడీఓ షేక్ జమీఉల్లా సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. జూలై 1న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో వలంటీర్లు తమ పరిధిలోని గృహాలకు వెళ్లి వారికి ఏయే ప్రభుత్వ పథకాలు అందలేదు, వారికి ఏయే ధ్రువీకరణ పత్రాలు అవసరమో గుర్తించి, అర్జీకి జతచేయాల్సిన పత్రాల గురించి తెలియజేయాలని చెప్పారు. మండల స్థాయి అధికారులు గ్రామ సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు సత్వరం పరిష్కరిస్తారని వివరించారు. తహసీల్దార్ సీహెచ్ ఉష, డిప్యూటీ తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వరరావు, ఈఓఆర్డీ ఎం.సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'జగనన్న సురక్షను' విజయవంతం చేయాలి

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి సచివాలయం పరిధిలో విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ×జగనన్న సురక్ష€పై శిక్షణ ఇచ్చి, పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టనుందన్నారు. దీని ద్వారా ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి ప్రజా సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. అందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో అర్హులెవరూ మిగిలిపోకుండా పథకాలు అందజేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, డీటీ స్రవంతి, ఈఓఆర్డీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ అభివృద్ధిలో భాగస్వాములుకండి



మార్టును పరిశీలిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

టంగుటూరు: మహిళా మార్టులో సరుకులు కొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ రత్నజ్యోతి కోరారు. స్థానిక మహిళా మార్టును తహసీల్దార్ సంజీవరావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి నారదముని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామాల్లో జూన్ 24 నుంచి వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి సమస్యలను గుర్తిస్తారని, జూలై 1 నుంచి ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తారన్నారు. ఈఓఆర్డీ నర్రా జగదీష్‌బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.